# ఐలమ్మ ఆశయాలు కొనసాగిద్దాం

- ఘనంగా చాకలి ఐలమ్మ జయంతి
- నివాళులర్పించిన నాయకులు

**జన్నారం/లక్సెట్టిపేట/పాతమంచిర్యాల/దండేపల్లి/భీమారం/నెన్నెల/మందమర్రిరూరల్:** సాయుధ పోరాట యోధురాలు, వీరనారి చాకలి ఐలమ్మ ఆశయాలను కొనసాగించాలని వక్తలు పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా గురువారం ఐలమ్మ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి, విగ్రహాలకు పూలమాలలు సమర్పించి నివాళులర్పించారు. ఐలమ్మ పోరాట ప్రతిమను వివరించారు. ఆయా కార్యక్రమాల్లో జిల్లా కేంద్రంలో మున్సిపల్ చైర్మన్ రావుల ఉప్పలయ్య, తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి జిల్లా అధ్యక్షుడు సంగెం లక్ష్మణ్, తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి జిల్లా నాయకులు ఎల్లయ్య, కొమురయ్య, తాడూరి శంకర్, రాష్ట్ర నాయకులు తంగళ్లపల్లి తిరుపతి, కొలిపాక రమేష్, నేతకాని సంఘం జిల్లా అధ్యక్షుడు దుర్గం స్వామి, మాజీ కౌన్సిలర్ పడాల రామన్న, రజక సంఘం పట్టణ అధ్యక్షుడు పారిపెల్లి శ్రీనివాస్, సలహాదారు సేర్ల రమేష్, రజక వృత్తిదారుల సంఘం జిల్లా అధ్యక్షుడు తంగళ్లపల్లి వెంకటేశం, బీసీ ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు ఒడ్డేపల్లి మనోహర్, గాండ్ల తేలికుల సంఘం జిల్లా అధ్యక్షుడు బుద్ది చంద్రమౌళి, జన్నారంలో బీసీ సంఘాల పోరాట సమితి ఉమ్మడి జిల్లా కన్వీనర్ కొడూరి చంద్రయ్య, దండేపల్లిలో రజక సంఘం జిల్లా అధ్యక్షుడు కట్కూరి రాజన్న, లక్సెట్టిపేట, భీమారం, నెన్నెల మండలాల రజక సంఘాల నాయకులు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.


జిల్లా కేంద్రంలో చాకలి ఐలమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రజక సంఘం నాయకులు


లక్సెట్టిపేట: పూలమాలలు వేస్తున్న నాయకులు


దండేపల్లిలో...


భీమారంలో...

## క్లుప్తంగా

### ఆరోగ్యశ్రీ ద్వారా ఆపరేషన్లు చేయించాలి

**మంచిర్యాలటౌన్:** జిల్లాలోని తలసేమియా, సికిల్‌సెల్ వ్యాధిగ్రస్తులకు తరుచూ రక్తం ఎక్కించడం వల్ల శరీరంలో ఐరన్ ఓవర్‌లోడ్ అయ్యి, అన్ని అవయవాలు జబ్బున పడతాయని, వారికి తగిన ఆపరేషన్లను ఆరోగ్యశ్రీలో చేసేందుకు వీలుందని, అవి జరిగేలా చూడాలని తలసేమియా వెల్ఫేర్ సొసైటీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కాసర్ల రంజిత్ కుమార్ ఒక ప్రకటనలో కోరారు. ఈ వ్యాధిగ్రస్తులకు కడుపులో బల్ల పెరగడం, గాల్‌బ్లాడర్‌లో రాళ్లు ఏర్పడడం, తరుచూ కడుపు నొప్పి రావడం, రక్తం తగ్గిపోవడం జరుగుతాయని తెలిపారు. ప్లేనెట్టమీ, గాల్ బ్లాడర్ ఆపరేషన్లు వీరికి చేయాలని, ఇవి ఆరోగ్యశ్రీ పథకంలో ఉన్నాయని, మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఆపరేషన్లు చేసేలా చూడాలని జిల్లా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకోవాలని కోరారు.

### వృద్ధులకు ఆట విడుపు


లెమన్ స్పూన్ ఆటలో వృద్ధులు

**మంచిర్యాలటౌన్:** జిల్లా మహిళా, శిశు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం వారోత్సవాల్లో భాగంగా గురువారం జిల్లా కేంద్రంలోని వృద్ధుల డే కేర్ సెంటర్, ఆనంద నిలయం, శ్రీసాయి దృష్టి ఓల్డేజి హోమ్‌లలోని వృద్ధులకు సరదాగా ఆటల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా క్యారం, చెస్, బకెట్ బాల్, లెమన్ స్పూన్, వైకుంఠపాళి వంటి ఆటలను ఆడించడంతో పాటు, వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. వృద్ధుల డే కేర్ సెంటర్‌లో సీనియర్ సిటిజన్ అసోసియేషన్ మెంబర్లకు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో ఎఫ్ఆర్‌వో ఎండి ఫర్జానా బేగం, జూనియర్ అసిస్టెంట్ ఎం.రవికాంత్, జెండర్ స్పెషలిస్టు కె. విజయ, లిప్పికలు పాల్గొన్నారు.

### ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలి


వినతిపత్రం ఇస్తున్న విద్యార్థి నాయకులు

**బెల్లంపల్లి:** తమ కళాశాలలో కాకుండా కో–ఎడ్యుకేషన్ కళాశాలలో ఎందుకు చేరుతున్నారని బీసీ హాస్టల్ విద్యార్థులను బెల్లంపల్లి ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ స్వరూప మానసిక వేదనకు గురిచేస్తున్నారని ఐక్య విద్యార్థిసంఘాల నాయకులు దీపక్‌కుమార్, రాజేంద్రప్రసాద్ తెలిపారు. మంచిర్యాల డీఐఈఓ అంజయ్య గురువారం విచారణకు రాగా విద్యార్థి సంఘాల నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... రెండు రోజుల క్రితం బీసీ హాస్టల్‌కు వెళ్లి ప్రిన్సిపాల్ విద్యార్థునులను దూషించి వేధించారని తెలిపారు. ఈ విషయమై ప్రిన్సిపాల్‌పై డీఐఈవోకు ఫిర్యాదు చేశామని, దీంతో ఆయన విచారణకు వచ్చారని పేర్కొన్నారు. విద్యార్థులను దూషించిన ప్రిన్సిపాల్‌ను బేషరతుగా సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

### కమాండెంట్‌కు వినతి


వినతిపత్రం అందజేస్తున్న సభ్యులు

**మంచిర్యాలరూరల్(హాజీపూర్):** అక్టోబర్ 1వ తేదీన జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవాన్ని పురస్కరించుకొని లయన్స్ క్లబ్ ఇంటర్‌నేషనల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మెగా రక్తదాన శిబిరానికి బెటాలియన్ కమాండెంట్ వెంకటరాములును ఆహ్వానిస్తూ గురువారం లయన్స్ క్లబ్ సీనియర్ సభ్యులు మధుసూధన్‌రెడ్డి, వినయ్‌కుమార్ పత్రికను అందజేశారు. అంతకుముందు కమాండెంట్ వెంకటరాములును శాలువాతో ఘనంగా సన్మానం చేశారు. రక్తదాన శిబిరంలో ముఖ్య అతిథిగా పాల్గొనడంతో పాటు రక్తదాన శిబిరంలో బెటాలియన్ ద్వారా రక్త యూనిట్లను సమకూర్చేలా దాతలను తీసుకురావాలని కోరారు.

### గోవును జాతీయ జంతువుగా ప్రకటించాలి

**మంచిర్యాలఅర్బన్:** గోవును జాతీయ జంతువుగా ప్రకటించాలని అఖిల భారతీయ అయ్యప్ప ధర్మ ప్రచార సభ జాతీయ ప్రధాన కార్యదర్శి తిరుమల్‌రావు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గోవును జాతీయ జంతువుగా ప్రకటించాలని ఉప్పెనగ సాగనున్న మహా పాదయాత్రను జయప్రదం చేయాలన్నారు.

## ‘రఘునాథ్‌పై వ్యక్తిగత విమర్శలు మానుకోవాలి’

**మంచిర్యాలటౌన్:** బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్‌పై కాంగ్రెస్ నాయకులు వ్యక్తిగత విమర్శలు చేయడాన్ని తాము ఖండిస్తున్నట్లు బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి పల్లి రాకేశ్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు బొలిశెట్టి అశ్విన్ రెడ్డిలు అన్నారు. జిల్లా కేంద్రంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. మంచిర్యాల నియోజకవర్గంలో ప్రజాసేవే ధ్యేయంగా రఘునాథ్ పనిచేస్తున్నారని, బీజేపీకి పెరుగుతున్న ఆదరణ చూసి ఓర్వలేకనే కాంగ్రెస్ నాయకులు విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు. వ్యక్తిగత విమర్శలకు దిగితే బీజేపీ నాయకులు చూస్తూ ఊరుకోరని హెచ్చరించారు. ఇప్పటికైనా ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చి, అభివృద్ధిపై దృష్టి పెడితే ప్రజలకు మేలు జరుగుతుందని హితవు పలికారు.


మాట్లాడుతున్న బీజేపీ, బీజేవైఎం నాయకులు

### విశ్వనాథ ఆలయ హుండీ ఆదాయం లెక్కింపు

**మంచిర్యాలఅర్బన్:** స్థానిక విశ్వనాథస్వామి దేవస్థానంలో హుండీ లెక్కింపు గురువారం నిర్వహించారు. వెంకటేశ్వర స్వామి, విశ్వనాథస్వామి, వాసవీమాత ఆలయాల ఆరు నెలలకు సంబంధించిన హుండీలను లెక్కించగా రూ.3,52,361 ఆదాయం సమకూరినట్లు పర్యవేక్షణాధికారి రాజమౌళి తెలిపారు. కార్యక్రమంలో ఈవో ముక్తరవి, ఉద్యోగులు, అర్చకులు అంజయ్య, గోవర్ధనబట్టాచార్యులు, నరహరిశర్మ, బాలక్రిష్ణ మహిళా సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

### డీఎల్‌పీవో ఆకస్మిక పర్యటన

**మంచిర్యాలరూరల్(హాజీపూర్):** హాజీపూర్ మండలంలోని పలు గ్రామాల్లో గురువారం మంచిర్యాల డీఎల్‌పీవో ధర్మారాణి ఆకస్మికంగా పర్యటించారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాల్లో భాగంగా గ్రామాల్లో చేపడుతున్న ఇంటింటా చెత్త సేకరణ కార్యక్రమాలను పర్యవేక్షించారు. ముల్కల్లలో శ్రమదానం కార్యక్రమాలను పర్యవేక్షించి సూచనలు చేశారు. గ్రామాల్లో ప్లాస్టిక్ వినియోగం జరగకుండా చూడాలని, పరిసరాల పరిశుభ్రతలో అంతా చైతన్యంతో వ్యవహరించాలని సూచించారు. గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి పిల్లల హాజరు, రికార్డులను పరిశీలించి చిన్నారులతో కలిసి కాసేపు కాలక్షేపం చేశారు. డీఎల్‌పీవో వెంట పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.


రిజిస్టర్లు పరిశీలిస్తున్న డీఎల్‌పీవో ధర్మారాణి

## వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

- డీపీవో వెంకటేశ్వర్‌రావు

**భీమారం:** ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తే ఆరోగ్య వంతులుగా ఉంటారని డీపీవో వెంకటేశ్వర్ రావు పేర్కొన్నారు. స్వచ్ఛతా హీ సేవ 2024 వజ్రోత్సవాల్లో భాగంగా గురువారం భీమారం మండలకేంద్రంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులతో కలిసి శ్రమదానం చేశారు. అనంతరం హాస్టల్‌లో మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం భీమారం గ్రామపంచాయతీ కార్యాలయాన్ని సందర్శించారు. గ్రామంలో చేపడుతున్న పనుల గురించి కార్యదర్శి కృష్ణమూర్తిని అడిగి తెలుసుకున్నారు. గ్రామపంచాయతీ రికార్డులను తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఎంపీవో సతీష్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి కృష్ణమూర్తితో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డీపీవో వెంకటేశ్వర్‌రావు

### పారిశుధ్యంపై శ్రద్ధ పెట్టండి

- కార్యదర్శులకు జెడ్పీ సీఈవో గణపతి సూచన

**వేమనపల్లి:** అన్ని గ్రామపంచాయతీల్లో పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని జెడ్పీ సీఈవో గణపతి సూచించారు. ఎంపీడీవో దేవేందర్‌రెడ్డితో కలిసి గురువారం మండలంలోని నీల్వాయి, కళ్లంపల్లి గ్రామపంచాయతీలను ఆయన ఆకస్మికంగా సందర్శించారు. గ్రామాల్లో జరుగుతున్న పారిశుధ్య పనులు పరిశీలించారు. వర్షపు నీరు నిల్వ ఉండకుండా చూడాలని, సీజనల్ వ్యాధులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. అనంతరం నీల్వాయిలోని కేజీబీవీ పాఠశాలను సందర్శించి అక్కడ అమలవుతున్న మెనూ పరిశీలించారు. వంటశాలకు వెళ్లి నాణ్యతను తనిఖీ చేశారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శులు అశోక్, సుదర్శన్‌లు ఉన్నారు.


సిబ్బందికి సూచనలు చేస్తున్న జెడ్పీ సీఈవో

## బొగ్గుబాయి వార్తలు

### సంతకాల సేకరణ

**మందమర్రిరూరల్:** గత ఆర్థిక సంవత్సరం సింగరేణికి వచ్చిన లాభాల్లో 33శాతం ఉద్యోగులకు పంపిణీ చేయాలని కోరుతూ గురువారం ఏరియాలోని టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో కార్మికులతో సంతకాల సేకరణ చేపట్టారు. కార్యక్రమంలో టీబీజీకేఎస్ ఏరియా, ఫిట్ కమిటీ నాయకులు ఉన్నారు.

### జీఎం కార్యాలయం ఎదుట ధర్నా


ధర్నా నిర్వహిస్తున్న బీఎంఎస్ నాయకులు

**శ్రీరాంపూర్:** బొగ్గుగని కార్మికుల డిమాండ్లపై బీఎంఎస్ ఆధ్వర్యంలో గురువారం శ్రీరాంపూర్ జీఎం కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ యూనియన్ శ్రీరాంపూర్ బ్రాంచీ ఉపాధ్యక్షుడు నాతాడి శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ ఏబీకేఎంఎస్ పిలుపులో భాగంగా ధర్నా నిర్వహించినట్లు తెలిపారు. కంపెనీలో ఉన్న సమస్యలను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ కేంద్ర కార్యదర్శి రాజేందర్, నాయకులు పాల్గొన్నారు.

### సీఎంపీఎఫ్ చిట్టీలు అందజేత

**కాసిపేట:** మందమర్రి ఏరియా కాసిపేట గనిపై కార్మికులకు గురువారం సీఎంపీఎఫ్ చిట్టీలను అధికారులు, గుర్తింపు సంఘం నాయకులు అందించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి దాగం మల్లేశ్, ఇన్‌చార్జి మేనేజర్ నిఖిల్ ఐయ్యర్, ఇన్‌చార్జి రక్షణాధికారి వెంకటేశ్వర్లు, సంక్షేమాధికారి జీషాన్, ఏఐటీయూసీ గని ఫిట్ కార్యదర్శి మినుగు లక్ష్మీనారాయణ, బన్న లక్ష్మణ్‌దాస్, నాయకులు పాల్గొన్నారు.

**మందమర్రిరూరల్:** ఏరియాలోని జీఎం ఆఫీస్‌లో ఏరియా జీఎం దేవేందర్ గురువారం ఉద్యోగులకు సీఎంపీఎఫ్ చిట్టీలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎస్వోటు జీఎం రాజేశ్వరరెడ్డి, పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్, డీవైపీఎం ఆసీఫ్, ఆఫీస్ సిబ్బంది, యూనియన్ ప్రతినిధులు ఉన్నారు.


మందమర్రిరూరల్: చిట్టీలు పంపిణీ చేస్తున్న జీఎం

### ‘సర్ఫేస్ కార్మికులకు అలవెన్స్ చెల్లించాలి’

**కాసిపేట:** మందమర్రి ఏరియా కాసిపేట గనిలో కంపెనీ అవసరం కోసం సర్ఫేస్‌లో పనిచేసిన 473మంది కార్మికులకు అండర్‌గ్రౌండ్ అలవెన్స్ యాజమాన్యం కటింగ్ చేయడాన్ని నిరసిస్తూ గురువారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. అనంతరం గని ఇన్‌చార్జి మేనేజర్ నిఖిల్ ఐయ్యర్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో బెల్లంపల్లి బ్రాంచి కార్యదర్శి దాగం మల్లేశ్, గని ఫిట్ కార్యదర్శి మినుగు లక్ష్మీనారాయణ, చిప్పరి శ్రీహరి, ఫార్మసిస్టు సురేష్, రంజిత్‌కుమార్, లింగయ్య, కమలాకర్, రఘురాం తదితరులు పాల్గొన్నారు.

### కార్మిక సమస్యలు తెలుసుకోవాలి

**మందమర్రిరూరల్:** ఏరియాలోని గనులు, డిపార్ట్‌మెంట్లపై కార్మిక సమస్యలు ఎప్పటికప్పుడు తెలుసుకొని పరిష్కరించే దిశగా ఫిట్ కమిటీ నాయకులు పనిచేయాలని ఏఐటీయూసీ సెంట్రల్ కమిటీ సెక్రెటరీ అక్బర్ అలీ సూచించారు. ఏరియాలోని యూనియన్ ఆఫీస్‌లో గురువారం మూడు బ్రాంచ్ (ఏరియా)ల స్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఏరియాలోని వివిధ యూనియన్ల నాయకులు ఏఐటీయూసీలో చేరగా వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. సమావేశంలో బ్రాంచ్ కార్యదర్శి సత్యనారాయణ, నాయకులు సుదర్శన్, ఏరియా నాయకులు, ఫిట్ కార్యదర్శులు ఉన్నారు.

## ‘చలో హైదరాబాద్’ విజయవంతం చేయండి

**మంచిర్యాలరూరల్(హాజీపూర్):** గురుకుల పాఠశాలల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 28న తలపెట్టిన చలో హైదరాబాద్–మహాధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గుర్రాల రాజావేణు పిలుపునిచ్చారు. ముల్కల్లలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, గుడిపేటలోని మహాత్మ జ్యోతిభా పూలే గురుకుల పాఠశాలలను గురువారం సందర్శించారు. ధర్నాలో ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కోశాధికారి బి.కిరణ్, జిల్లా కార్యదర్శి బి.దేవదాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**గురుకుల సమస్యలు పరిష్కరించాలి**

**మంచిర్యాలఅర్బన్:** గురుకుల పాఠశాలలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజావేణు డిమాండ్ చేశారు. పట్టణంలో టీజీఎస్‌డబ్ల్యూఆర్ఎస్, టీజీఎంజేపీఆర్ఎస్ గురుకుల పాఠశాలను గురువారం సందర్శించారు. గురుకుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 28న హైదరాబాద్‌లో నిర్వహించే మహాధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా కోశాధికారి కిరణ్, జిల్లా కార్యదర్శి దేవదాస్ పాల్గొన్నారు.


నినాదాలు చేస్తున్న టీఎస్‌యూటీఎఫ్ బృందం

## క్రీడా పోటీల్లో కార్మికులు రాణించాలి

**బెల్లంపల్లి:** క్రీడా పోటీల్లో సింగరేణి కార్మికులు రాణించాలని బెల్లంపల్లి సింగరేణి ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ ఏఎస్ఎస్ డాక్టర్ రాధాకృష్ణ అన్నారు. టీసీఓఏ క్లబ్ ఆవరణలో గురువారం డబ్ల్యూపీఎస్‌జీఏ 91వ వార్షిక క్రీడా పోటీలను ప్రారంభించారు. ఉత్సాహ పూరిత వాతావరణంలో లాన్ టెన్నిస్ డిపార్ట్‌మెంటల్ క్రీడా పోటీలు జరిగాయి. డిపార్ట్‌మెంటల్ క్రీడా పోటీల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులు నియర్ బై పోటీల్లో పాల్గొననున్నట్లు నిర్వాహకులు ప్రకటించారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ కోఆర్డినేటర్ కిరణ్, జనరల్ కెప్టెన్ చంద్రకుమార్, ఏఐటీయూసీ నాయకుడు డీ.ఆర్.శ్రీధర్, క్రీడాకారులు పాల్గొన్నారు.


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న సూపరింటెండెంట్ ఏఎస్ఎస్ డాక్టర్ రాధాకృష్ణ

### స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలని ధర్నా

**మంచిర్యాలఅగ్రికల్చర్:** పెండింగ్ స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంటు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం కలెక్టరేట్ ఎదుట యూఎస్‌ఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్ కుమార్ దీపక్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యూఎస్‌ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మిట్టపల్లి తిరుపతి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### క్రీడా దుస్తులు అందజేత

**జన్నారం:** మండలంలోని చింతగూడ గ్రామ ఉన్నత పాఠశాలలో చదువుతున్న 152మంది విద్యార్థులకు రూ.75వేలు విలువ చేసే క్రీడా దుస్తులను రిటైర్డ్ డీసీపీ చింతగూడ గ్రామ వాసి చెప్యాల మల్హాల్ రావు, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ చెప్యాల రవీందర్ రావులు గురువారం అందజేశారు. విద్యార్థులను క్రీడాపరంగా ప్రోత్సాహించేందుకు దుస్తులు అందజేసినట్లు వారు పేర్కొన్నారు. ఉన్న ఊరికి తనవంతుగా ప్రోత్సాహం అందించాలని, ఇలాంటి కార్యక్రమాలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

### రోడ్డును బాగు చేసుకున్న రైతులు

**చెన్నూర్‌రూరల్:** మండలంలోని నాగాపూర్‌లో సుమారు 400ఎకరాల వరకు పంట పొలాలు ఉన్నాయి. కానీ పొలాలకు వెళ్లేందుకు రోడ్డు మొత్తం గుంతలమయంగా మారింది. దీంతో ఎడ్లబండ్లు, ట్రాక్టర్లు వెళ్లడం కష్టంగా మారింది. సుమారు 25 మంది రైతులు ఒక్కరికి రూ.500 చొప్పున పోగు చేసి, బ్లేడ్ ట్రాక్టర్ ద్వారా రోడ్డు చదును చేయించుకున్నారు.

### చిత్రలేఖనం పోటీలు

**పాతమంచిర్యాల:** అక్టోబర్ 01 బీఎస్ఎన్ఎల్ ఫార్మేషన్ డే ను పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని మార్కెట్ రోడ్‌లోని బాలికల ఉన్నత పాఠశాలలో ఈ నెల 28న 05సంవత్సరాల నుంచి 10సంవత్సరాల లోపు పిల్లలకు చిత్రలేఖనం(డ్రాయింగ్) పోటీలు నిర్వహించనున్నట్లు బీఎస్ఎన్ఎల్ ఏరియా డివిజనల్ మేనేజర్ కొండయ్య ఒక ప్రకటనలో తెలిపారు. పోటీలకు హాజరయ్యే పిల్లలకు డ్రాయింగ్ షీట్ ఇవ్వనున్నట్లు, ప్రతిభ చూపిన పిల్లలకు అక్టోబర్ 01న బహుమతులు ప్రదానం చేస్తామన్నారు. ఆసక్తి గల పిల్లలు 28న మధ్యాహ్నం 2గంటలకు బాలికల పాఠశాలలో హాజరు కావాలన్నారు.

### పెండింగ్ వేతనం చెల్లించాలని గెస్ట్ లెక్చరర్ నిరసన

**బెల్లంపల్లి:** పెండింగ్ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల గెస్ట్ లెక్చరర్ కె.చంద్రశేఖర్ నిరసన తెలిపారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద గురువారం నిరసన తెలిపి ఆయన మాట్లాడారు. 2023–24 విద్యాసంవత్సరంలో గెస్ట్ లెక్చరర్‌గా పని చేశానని, అప్పటి ప్రిన్సిపాల్ అవినీతిని తాను బయట పెట్టడంతో ఏప్రిల్, మే నెలల వేతనాల్లో కోత పెట్టి వేధిస్తున్నారని తెలిపారు. ప్రస్తుత ప్రిన్సిపాల్‌కు దరఖాస్తు పెట్టి 45రోజులు గడుస్తున్నా ఇంతవరకు బిల్ చేయలేదన్నారు. గత ప్రిన్సిపాల్ మాదిరిగానే ప్రస్తుత ప్రిన్సిపాల్ వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. తనకు న్యాయం చేయాలని తెలంగాణ ఉన్నత విద్యాశాఖ అధికారులను ఆయన కోరారు.

## సంక్షిప్త వార్తలు

### కొండచిలువ సంచారం

**మందమర్రిరూరల్:** పట్టణంలోని దీపక్‌నగర్ వెళ్లే దారి దమ్మప్ గోదాం వద్దా గ్రామస్తులకు గురువారం కొండచిలువ కనిపించింది. వారు స్నేక్ సొసైటీ సభ్యులకు సమాచారం అందించడంతో అక్కడకి చేరుకున్న సభ్యులు, దాన్ని పట్టుకొని అటవీ ప్రాంతంలో వదిలిపెట్టారు.

### మానవత్వం చాటుకున్న పోలీసులు

**మంచిర్యాలక్రైం:** జిల్లా కేంద్రంలోని రైల్వేస్టేషన్ పరిసర ప్రాంతాల్లో ఓ మతిస్థిమితం లేని మహిళ (35) బుధవారం రాత్రి దుస్తులు లేకుండా సంచరిస్తుండగా, స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. సీఐ బన్సీలాల్ పెట్రోలింగ్ డ్యూటీలో ఉన్న ఏఎస్సై సత్తన్న, డ్రైవర్ పర్వతాలుకు విషయాన్ని తెలియజేశారు. వెంటనే వారు అక్కడికి వెళ్లి ఓ మహిళా ప్రయాణికురాలి సహాయంతో దుస్తులు తొడిగించి మానవత్వం చాటుకున్నారు. ఆమె వివరాలు తెలుసుకునేందుకు ప్రయత్నించగా తను ఎలాంటి సమాధానం చెప్పలేదు.

### మూడు రోజులు బంద్ పాటించాలి

**పాతమంచిర్యాల:** పెయింటర్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఏరియాలోని పెయింటర్ కార్మికులు ఈ నెల 27, 28, 29తేదీల్లో బంద్ పాటించాలని మంచిర్యాల ఏరియా పెయింటర్ వర్కర్స్ అసోసియేషన్, తెలంగాణ పెయింటర్స్ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు మంచెర్ల సదానందం అన్నారు. జిల్లా కేంద్రంలోని భవన నిర్మాణ కార్మిక సంఘం కార్యాలయంలో గురువారం పెయింటర్ కార్మికులతో సమావేశం నిర్వహించారు.

### విద్యార్థినులకు రక్తపరీక్షలు

**నెన్నెల:** గిరిపోషణ్ మిత్ర కార్యక్రమంలో భాగంగా చిత్తాపూర్ గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థినులకు గురువారం హిమోగ్లోబిన్, సీబీపీ, రక్తహీనత పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేసినట్లు బెల్లంపలి డిప్యూటీ డీఎంహెచ్ఓ సుధాకర్‌నాయక్, మెడికల్ ఆఫీసర్ లక్ష్మణ్ తెలిపారు.

### భీమారం ఎంపీడీవోగా మధుసూదన్

**భీమారం:** మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా మధుసూదన్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈ మేరకు డీపీవో వెంకటేశ్వర్‌రావు, ఎంపీవో సతీష్, కార్యదర్శి కృష్ణమూర్తిలు శాలువా కప్పి స్వాగతం పలికారు.

### బీజేపీ సభ్యత్వ నమోదు

**చెన్నూర్:** పట్టణంలోని 189 బూత్‌లో ఆన్‌లైన్ ద్వారా అవగాహన కల్పిస్తూ బీజేపీ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదును ప్రారంభించారు. కార్యక్రమంలో సభ్యత్వ నమోదు కన్వీనర్ కేవీఎం శ్రీనివాస్, కౌన్సిలర్ కమ్మల శ్రీనివాస్, వెంకటనర్సయ్య, పట్టణ అధ్యక్షుడు తుమ్మ శ్రీపాల్, మాణికరావు శంకర్, కాయిత రాజేశ్, అడప శ్రీనివాస్ పాల్గొన్నారు.

### యువ టూరిజం క్లబ్‌పై అవగాహన

**మంచిర్యాలఅర్బన్:** స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం యువ టూరిజం క్లబ్‌పై అవగాహన కల్పించారు. కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ నరేందర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో విశ్రాంత సింగరేణి అధికారి శ్యాంసుందర్‌రెడ్డి విద్యార్థులకు టూరిజంపై అవగాహన కల్పించారు. గాంధారి ఖిల్లా చారిత్రకమైన టూరిస్టు ప్రదేశాలను వివరించారు. అంతకుముందు చాకలి ఐలమ్మ జయంతిని ఘనంగా నిర్వహించారు. చాకలి ఐలమ్మ వీరత్వాన్ని కొనియాడారు. కార్యక్రమంలో అధ్యాపకులు రాజయ్యతోపాటు పలువురు పాల్గొన్నారు.

### వినతిపత్రం అందజేత

**లక్సెట్టిపేట:** మున్సిపల్ పరిధిలోని తీగలకుంటకు నీరందించే కాలువ కబ్జాకు గురైందని, మండలంలోని రజక సంఘం ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ దిలీప్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ రాజశేఖర్‌లకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో మండల రజకసంఘం నాయకులు పాల్గొన్నారు.

### బాధ్యతలు స్వీకరణ

**లక్సెట్టిపేట/నెన్నెల/దండేపల్లి/మంచిర్యాలఅర్బన్:** నెన్నెల మండల ఎంఈవోగా చంద్రశేఖర్ రెడ్డి, లక్సెట్టిపేట మండల విద్యాధికారిగా హెలెన్ డారోతి, దండేపల్లి మండల విద్యాధికారిగా దుర్గం చిన్నయ్య, మంచిర్యాల విద్యాధికారిగా వీఎస్‌వీ మాళవీదేవి గురువారం బాధ్యతలు స్వీకరించారు.

## ప్రజల రక్షణ కోసమే కమ్యూనిటీ కాంటాక్ట్

**బెల్లంపల్లిరూరల్:** ప్రజల రక్షణ కోసమే కమ్యూనిటీ కాంటాక్ట్ చేపడుతున్నట్లు బెల్లంపల్లి రూరల్ సీఐ అఫ్జలొద్దిన్ అన్నారు. బెల్లంపల్లి మండలం బుధాకలాన్‌లో గురువారం తాళ్లగురిజాల ఎస్సై చుంచు రమేశ్ ఆధ్వర్యంలో కమ్యూనిటీ కాంటాక్ట్ చేపట్టారు. డాగ్ స్క్వాడ్ ద్వారా ఇంటింటినీ, కిరాణా షాపుల్లో తనిఖీ చేశారు. సరైన వాహన ధృవీకరణ పత్రాలు లేని 30ద్విచక్రవాహనాలు, 8ఆటో వాహనాలను సీజ్ చేసి జరిమానా విధించారు. రూ.9550 విలువ చేసే అక్రమ మద్యాన్ని స్వాధీనం చేసుకుని, ముగ్గురిపై కేసు నమోదు చేశారు. కార్యక్రమంలో బెల్లంపల్లి టూటౌన్ ఎస్సై మహేందర్, తాళ్లగురిజాల ఏఎస్సై మజారుద్దిన్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సీఐ అఫ్జలొద్దిన్